సాక్షి నిజామాబాద్

సోమవారం ၊ 6 ၊ మే ၊ 2024



వలస కార్మికులకు అండగా

గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత తెలపడంతో కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

- IIలో ▸



పొరపాట్లకు తావులేకుండా..

ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

44.6 /27.1

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వాతావరణం పొడిగా మారుతుంది. వడగాలులు వీస్తాయి.

నగరంలోని గిరిరాజ్ కాలేజీ మైదానంలో బీజేపీ విశాల జనసభకు హాజరైన ప్రజలు



అభివాదం చేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

న్యూస్‌రీల్

అమిత్ షా సభ సైడ్‌లైట్స్

సుభాష్‌నగర్: నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇందూరు విశాల జనసభ పేరుతో బహిరంగ సభను నిర్వహించింది. సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

- అమిత్ షా సాయంత్రం 5.55కు గిరిరాజ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్‌కు చేరుకున్నారు.
- హెలీప్యాడ్ వద్ద ఎంపీ అర్వింద్ సహా పలువురు అమిత్ షాకు స్వాగతం పలికారు.
- 5.58 గంటలకు వేదికపైకి చేరుకుని, ప్రజలకు అభివాదం చేశారు.
- 5.59కి ప్రసంగం ప్రారంభించారు.
- దాదాపు 20 నిమిషాలు ప్రసంగించి 6.19కి ముగించారు.
- 6.24 గంటలకు అమిత్ షా హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్లారు.
- అమిత్ షా సమయాభావంతో వేదికపై కూర్చోకుండా నేరుగా ప్రసంగించి వెళ్లిపోయారు. సన్మానాలను తిరస్కరించారు.

ఎండ వేడికి ఆమ్లెట్



పెర్కిట్(ఆర్మూర్): ఎండ తీవ్రతను తెలియజేస్తూ ఓ బాలిక ఆమ్లెట్ వేసింది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో తొమ్మిదో తరగతి చదువుతున్న శరణ్య ఆదివారం ఉదయం 10 గంటలకు ఆరు బయట పెనం పెట్టి గుడ్డు పగుల గొట్టి వేసింది. ఎండవేడికి పది నిమిషాల్లో ఆమ్లెట్ సిద్ధం అయ్యింది. ఆర్మూర్‌లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది.

కంట్రోల్ యూనిట్ల తరలింపు



సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆయా శాసనసభ నియోజకవర్గాలకు ఆదివారం అదనపు కంట్రోల్ యూనిట్లు తరలించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో ప్రక్రియ నిర్వహించారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ జరిపారు. ఆ జాబితాను అనుసరిస్తూ కంట్రోల్ యూనిట్లను నియోజకవర్గాల బాధ్యులకు అప్పగించగా, బందోబస్తు నడుమ నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చారు. అన్ని సెగ్మెంట్లకు ఇప్పటికే ఈవీఎంల తరలింపు పూర్తయ్యిందని, కమిషనింగ్ ప్రక్రియ సందర్భంగా పలు కంట్రోల్ యూనిట్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అదనంగా కేటాయించామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ పాల్గొన్నారు.

అమితానందం!

- బీజేపీ అగ్రనేత అమిత్‌షా సభతో పార్టీ శ్రేణుల్లో జోష్
- మోదీ హవా నేపథ్యంలో షా పర్యటన బూస్ట్‌గా భావిస్తున్న నాయకులు
- రైతులు, యువత తమపక్షానే ఉన్నారంటూ ధీమా
- 'ఇందూరులోనే పసుపు బోర్డు!' విషయాన్ని ముందే చెప్పిన 'సాక్షి'



మాట్లాడుతున్న అమిత్ షా, పక్కన అర్వింద్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇందూరు పర్యటన విజయవంతం కావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అమితానందం నెలకొంది. ఇటీవల నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాలలో ప్రధాని మోదీ పర్యటించారు. అనంతరం దేశంలో మోదీ తర్వాత రెండో ప్రాధాన్యత వ్యక్తిగా వెలుగొందుతున్న అమిత్‌షా ఇందూరుకు రావడం, సభ విజయవంతం కావడం పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది. మోదీ హవా నడుస్తున్న తరుణంలో ఉత్తర తెలంగాణలో అమిత్‌షా టూర్ రెట్టింపు బలాన్నిచ్చినట్లు అయిందని కార్యకర్తలు అంటున్నారు. కేంద్ర మంత్రి హోదాలో అమిత్‌షా రాజకీయ ప్రసంగంతో పాటు కీలకమైన పసుపు బోర్డు, షుగర్ ఫ్యాక్టరీలకు సంబంధించి ఇచ్చిన హామీలు పార్టీ కేడర్‌లో తిరుగులేని ఉత్సాహాన్ని కల్గిస్తున్నాయి. గత శాసనసభ ఎన్నికల ముందు తెలంగాణలో పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు నరేంద్రమోదీ ప్రకటించారు. తాజాగా జరిగిన సభలో ఇప్పుడు అమిత్‌షా పసుపు బోర్డు కార్యాలయాన్ని నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంతో ఎంపీ అభ్యర్థి అర్వింద్‌తో పాటు బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ కార్యాలయాన్ని నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తారా? హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తారా అనే విషయమై ఒక స్పష్టత లేకుండా పోయింది. ఈ క్రమంలో అమిత్‌షా పసుపు బోర్డు కార్యాలయం విషయమై స్పష్టత ఇవ్వడం గమనార్హం. ఇదిలా ఉండగా కేంద్ర వాణిజ్య శాఖ సైతం పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు విషయమై పంపిన ప్రతిపాదనల్లో నిజామాబాద్‌తో పాటు హైదరాబాద్ ఆప్షన్ ఇచ్చింది. ఈ డైలమా ఉండగా అమిత్‌షా నిజామాబాద్‌లోనే పసుపు బోర్డు కార్యాలయం అంటూ ప్రకటించారు. కాగా అర్వింద్ నామినేషన్‌కు పసుపు రైతులే ఒక్కొక్కరు రూ.1000 చొప్పున రూ.25 వేలు చెల్లించడం విశేషం.

'సాక్షి' కథనం..

'ఇందూరులోనే పసుపు బోర్డు' శీర్షికన కథనాన్ని గత నెల 19న 'సాక్షి' ప్రచురించింది. వాణిజ్య శాఖ పంపిన ప్రతిపాదన నేపథ్యంలో కేంద్రం ఇందూరు వైపే మొగ్గుచూపిన అంశాన్ని కథనంలో ప్రస్తావించాం. బోర్డు వస్తే కలిగే లాభాలు, పసుపు శుద్ధి కర్మాగారాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రైవేట్ స్టోరేజ్ కేంద్రాలు తరలి రావడంతో పాటు కొత్త వంగడాల అభివృద్ధి, సాగు విస్తీర్ణం పెంపునకు అవకాశాలు కలుగుతాయని కథనంలో పేర్కొన్నాం.

సహకార విధానంలో షుగర్ ఫ్యాక్టరీ..

ఇక కీలకమైన నిజాం షుగర్స్ అంశంపై అమిత్‌షా చేసిన ప్రకటనపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర సహకార శాఖ మంత్రిగానూ వ్యవహరిస్తున్న షా షుగర్ ఫ్యాక్టరీలను సహకార విధానంలో ప్రారంభించి నడిపిస్తామని పేర్కొన్నారు. రైతు ఉద్యమాల ఖిల్లాగా పేరుపొందిన జిల్లాలో రైతులే ఎన్నికల ఫలితాలను నిర్దేశించనున్నారు. ఈ క్రమంలో పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు, నిజాం షుగర్స్ ప్రారంభం అంశాలపై అమిత్‌షా ప్రకటనతో పార్టీలో ఉత్సాహం భారీగా పెరిగింది.



సభలో చిన్నారుల అభిమానం

మోదీ ఉన్నంత వరకు రిజర్వేషన్లు కొనసాగుతాయి

తాను బతికున్నంత వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కొనసాగిస్తామని ఇటీవల నరేంద్ర మోదీ ప్రకటించారని ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. ముస్లింల రిజర్వేషన్లు తీసేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెంచుతామన్నారని ఆయన పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ నాయకులు బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మోదీ ఉన్నంతవరకూ రిజర్వేషన్లు రద్దు చేయరని, సీఎంగా రేవంత్‌రెడ్డి ఉన్నంత కాలం ఆరు గ్యారంటీలు అమలు కావని ఎద్దేవా చేశారు. సీఏఏ, ఎన్ఆర్సీ, యూనిఫాం సివిల్ కోడ్‌పై జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ స్టాండ్ చెప్పాలని డిమాండ్ చేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయ్యిందని, త్వరలోనే మధురలో శ్రీకృష్ణుడి టెంపుల్ నిర్మిస్తామన్నారు. ఓట్ల కోసం ముస్లింలను ఎన్ని రోజులు మోస్తారని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు.

ఇందూరులోనే పసుపు బోర్డు

- స్పష్టం చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ప్రధాని మోదీ వెంట పడి అర్వింద్ సాధించారని ప్రశంస



సుభాష్‌నగర్: ఇందూరు కేంద్రంగానే పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కానుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. పసుపు రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు కోసం ప్రధాని మోదీ వెంట పడి సాధించారని అన్నారు. వెంటనే గెజిట్ కూడా వచ్చిందన్నారు. నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా, అర్వింద్‌ను రెండోసారి ఎంపీగా గెలిపిస్తే బోర్డు ఏర్పాటు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఇందూరు విశాల జనసభలో అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నవనాథ సిద్ధుల గుట్ట, కందకుర్తి త్రివేణి సంగమం, డిచ్‌పల్లి రామాలయం, బాసర సరస్వతి అమ్మవారికి నమస్కరించి ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు.

బీడీ కార్మికుల కోసం ఆస్పత్రి

పార్లమెంట్ పరిధిలో బీడీ కార్మికుల సంక్షేమం కోసం 500 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని అమిత్ షా ప్రకటించారు. 70 ఏళ్ల కాంగ్రెస్ హయాంలో అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేపట్టలేదన్నారు. మోదీ ఐదేళ్లలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ చేశారని గుర్తు చేశారు. రామ జన్మభూమి రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించారని, అయితే ఓవైసీకి భయపడి హాజరుకాలేదని అమిత్ షా ఎద్దేవా చేశారు. మోదీ మూడోసారి ప్రధాని అయితే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. నిజామాబాద్‌లో వెలుగు చూసిన పీఎఫ్ఐ మూలాలను కూకటి వేళ్లతో పెకిలించి వేశామన్నారు. మోదీ సర్జికల్ స్ట్రైక్ ద్వారా పాకిస్తాన్‌లోకి చొరబడి ఉగ్రవాదులను చంపారని అన్నారు.

- రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి ఫేక్ వీడియో సృష్టించి ప్రచారం చేశారని, తన వ్యాఖ్యలు వక్రీకరించి దుష్ప్రచారం చేశారని అమిత్ షా అన్నారు. ఎన్నికల సమయంలో అలా చేస్తే ఏం జరుగుతుందో రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. ముస్లిం మహిళల ఆత్మగౌరవం కోసం మోదీ త్రిపుల్ తలాక్‌ను రద్దు చేస్తే.. కాంగ్రెస్ దాన్ని మళ్లీ తీసుకొస్తానని ప్రకటించిందన్నారు.
- చెరుకు ఫ్యాక్టరీలు మూత పడటానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ కారణమని అమిత్ షా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, చక్కెర కర్మాగారాలు తెరిపించాలన్నారు. ప్రజలు మే 13న కమలం గుర్తుకు ఓటు వేసి అర్వింద్‌ను గెలిపించాలని కోరారు.



అభివాదం చేస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్, నాయకులు ప్రకాశ్‌రెడ్డి, దినేశ్, మోహన్‌రెడ్డి, గంగారెడ్డి

నేడు కేసీఆర్ రోడ్‌షో



నగరంలో కూడళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల తదితరులు

- నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం
- విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణుల సన్నాహాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్, జహీ రాబాద్ పార్లమెంట్ స్థానాల్లో త్రిముఖ పోటీ నెలకొన్న నేపథ్యంలో కేసీఆర్ పర్యటన తమకు మేలు చేస్తోందనే ఆశాభావంతో బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నాయి. ఆదివారం జగిత్యాలలో రోడ్‌షో పూర్తిచేసుకున్న కేసీఆర్ సోమవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఆర్మూర్ మీదుగా కేసీఆర్ రోడ్‌షో ద్వారా నిజామాబాద్‌కు రానున్నారు. నిజామాబాద్‌లోని నెహ్రూ పార్క్ వద్ద సాయంత్రం కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. రాత్రి నిజామాబాద్‌లోనే బస చేయనున్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లాలో బస్సు యాత్ర చేయనున్నారు. అదేరోజు సాయంత్రం కామారెడ్డి పట్టణంలో కార్నర్ సభ నిర్వహించనున్నారు.

శాసనసభ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌లో కొంతమేర నిస్తేజం అలుముకుంది. ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో సత్తా చాటేందుకు కేసీఆర్ గట్టిగా కృషి చేస్తున్నారు. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు బలమైన సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకులు కావడంతో గెలుపుపూ పార్టీ గట్టిగానే ఆశలు పెట్టుకుంది. పలువురు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు పార్టీని వదిలి వెళ్లినప్పటికీ ఉద్యమనేతగా పేరున్న కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రంలో చేస్తున్న బస్సు యాత్రకు మంచి స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో తాజా పర్యటన శ్రేణుల్లో ఉత్సాహం తీసుకొస్తుందని నాయకులు ఆశలు పెట్టుకున్నారు.

కేసీఆర్ రోడ్‌షో రూట్ల పరిశీలన

నిజామాబాద్ నాగారం: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నగరంలో మాజీ సీఎం కేసీఆర్ బస్సుయాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రోడ్‌షో నిర్వహించే పలు కూడళ్లను ఆదివారం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పరిశీలించారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: నగరంలో సోమవారం మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షో సందర్భంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు నగరంలోని పలు ప్రాంతాల్లో కేసీఆర్ రోడ్ షో ఉండటంతో కింది ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లించినట్లు పేర్కొన్నారు.

- బోధన్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు అర్సపల్లి రైల్వే గేట్, కొత్త కలెక్టరేట్ మీదుగా కంఠేశ్వర్ బై పాస్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా బస్‌స్టాండ్ చేరుకోవాలి.
- బోధన్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు రైల్వే ఫ్లై ఓవర్, శివాజీ చౌక్, నిజాం కాలనీ, అర్సపల్లి మీదుగా వెళ్లాలి.
- మాధవనగర్ నుంచి బోధన్ వెళ్లే వాహనాలు పులాంగ్ సర్కిల్, ఆర్ఆర్ చౌరస్తా, వర్ని చౌరస్తా, ఈద్గా రోడ్ అర్సపల్లి మీదుగా వెళ్లాలి.

పార్కింగ్ స్థలాలు

- ఆర్మూర్, డిచ్‌పల్లి వైపు నుంచి వచ్చే వాహనాలను ప్రెస్‌క్లబ్, ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్, టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఎదుట నిలపాలి.
- బోధన్ వైపు నుంచి వచ్చే వాహనాలను శైలజ గ్రౌండ్, ఖిల్లా జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో పార్క్ చేయాలి. వాహనదారులు, ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు.

ఎల్లారెడ్డి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు నోటీసులు?

తెయూ(డిచ్‌పల్లి): వార్షిక అనుబంధ గుర్తింపు తనిఖీ సందర్భంగా సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ నుంచి తెలంగాణ యూనివర్సిటీ అధికారులు వివరణ కోరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. తెయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ, బీఈడీ కళాశాలల గుర్తింపు తనిఖీలకు సంబంధించిన నోటిఫికేషన్ మార్చి 7న విడుదల చేశారు. తనిఖీల సందర్భంగా ఆయా కళాశాలలకు సంబంధించిన డాక్యుమెంట్‌లు, బిల్లులు, సిబ్బంది వేతనాల చెల్లింపుల రికార్డులు, ఇతర వివరాలు సిద్ధంగా ఉంచాలని వర్సిటీ అధికారులు పలుమార్లు కాలేజీలకు సూచించారు.

సమాచారం ఇచ్చినా..

తనిఖీలు ఏప్రిల్ 25 నుంచి మొదలవుతాయని ఏప్రిల్ 2న మరోసారి వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలకు ఆడిట్ సెల్ అధికారులు సమాచారాన్ని అందించారు. శనివారం (మే 4న) ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ తనిఖీలకు వచ్చిన వర్సిటీ అధికారులకు అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది అసంపూర్తిగా సమాచారాన్ని ఇవ్వడంతో వారు అసహనానికి గురయ్యారు. తమకు శనివారం ఉదయం వరకు తనిఖీల సమాచారం లేదని, ప్రిన్సిపాల్ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సిబ్బంది చెప్పడంతో వర్సిటీ అధికారులు అవాక్కయ్యారు. అయితే అప్పటికప్పుడు కనీసం ఎవరికైన ఇన్‌చార్జి ఇవ్వాలని కోరినా ప్రిన్సిపాల్ నుంచి స్పందన కరువైంది. సుమారు రెండు గంటల తర్వాత ప్రిన్సిపాల్ చెప్పారని ఆడిట్ సెల్ డైరెక్టర్‌కు కాకుండా తనిఖీ బృందంలోని మరో అధికారికి కాలేజీ పార్ట్ టైం ఉద్యోగి లేఖ ఇవ్వగా ఆయన తిరస్కరించినట్లు తెలిసింది.

అధికారుల ఆగ్రహం

అడ్మిషన్ రిజిస్టర్ అసంపూర్తిగా ఉందని, లైబ్రేరియన్ అందుబాటులో లేదని, ఉన్న సిబ్బంది వర్సిటీ అధికారులు అడిగిన వాటికి సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ఆగ్రహం వ్యక్తం చేసిన వర్సిటీ అధికారులు ప్రిన్సిపాల్‌ను వివరణ కోరుతూ నోటీసు జారీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రిన్సిపాల్ వైఖరి ఎప్పుడూ ఇలాగే నిర్లక్ష్యంగా ఉంటుందని తనిఖీ బృందం సభ్యులు ఒకరు చెప్పారు. ప్రిన్సిపాల్ గైర్హాజరు, నిర్లక్ష్య వైఖరిపై కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

ప్రశాంతంగా నీట్ పరీక్ష



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా పది కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 3,733 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,654 మంది పరీక్ష రాశారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కో ఆర్డినేటర్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: జిల్లా కబడ్డీ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై ంది. నగరంలో ఓ హోటల్‌లో నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా, ఎలాంటి ఓటరు జాబితా బయటపెట్టకుండానే రహస్య సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారు. ఏళ్ల తరబడిగా ఉన్నవారే పదవుల కోసం పాకులాడడంతోనే ఎన్నికలు నిర్వహించకుండానే రహస్యంగా సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా అంద్యాల లింగన్న, కార్యదర్శిగా గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుబ్బారావు, శ్రావణ్‌రెడ్డి, బొబ్బిలి నర్సయ్య, హైదర్‌అలీ, గంగారెడ్డి, జాయింట్ కార్యదర్శులుగా రాజేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, మీసాల ప్రశాంత్, రాజేందర్, కోశాధికారిగా సురేందర్, 9 మంది ఈసీ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, క్రీడల అధికారి ముత్తెన్న, గాదరి సంజీవరెడ్డి వ్యవహరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు), లింగంపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి తివారి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం పరిశీలించారు. వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని జక్సాని నాగన్నగారి మెట్ల బావిని సందర్శించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రఘునాథ్, తహసీల్దార్ నరేందర్, ఉప తహసీల్దార్ రాజేశ్వర్, బీఎల్‌వోలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి'

గాంధారి: ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కు సూచించారు. ఆదివారం గుర్జల్, బ్రాహ్మణపల్లి, గాంధారిలలోని కొనుగోలు కేంద్రాలను, గాంధారిలోని రైస్ మిల్లును సందర్శించారు. రైతులకు నీడ, మంచినీటి వసతి కల్పించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మూడు రోజులలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున కేంద్రాల నిర్వాహకులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి పొద్దుపోయాక కూడా ధాన్యం కొనుగోలు చేసి, ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. 2023–24 ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను గడువులోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలని మిల్లర్లకు సూచించారు.

వలస కార్మికులకు అండగా..

- గల్ఫ్‌బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖత
- కలుగనున్న బీమా ప్రయోజనాలు



వలస కార్మికుల సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

మోర్తాడ్: ఎన్నో ఏళ్ల నుంచి గల్ఫ్ ప్రవాసులు కోరుతున్న ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖతను వ్యక్తం చేయడంతో వలస కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వలస జీవులకు అండగా తాము ఉన్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం భరోసాను కల్పిస్తూ కార్మికుల కలలను సాకారం చేస్తూ ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు ప్రకటన చేసింది. మరోసారి గల్ఫ్ బోర్డు అంశం తెరపైకి రావడంతో వలస కార్మికులు తమ ఆకాంక్షలు త్వరలోనే నెరవేరబోతున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గల్ఫ్ వలస కార్మికుల సంఘాల ప్రతినిధులతో హైదరాబాద్‌లో గడిచిన నెలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల తంతు ముగియగానే ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని వెల్లడించడంతో వలస కార్మికుల ప్రధాన సమస్యకు పరిష్కారం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో రైతులకు అందిస్తున్న బీమా తరహాలోనే గల్ఫ్ కార్మికులకు బీమా ప్రయోజనాలను అందించేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇద్దరు గల్ఫ్ మృతులకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందించారు. ఏజెంట్ల విధానంలోను సమూల మార్పులు తీసుకురావడానికి విధివిధానాలను రూపొందించబోతున్నామని సీఎం ప్రకటించడం గమనార్హం.

నిర్దిష్టమైన విధానం లేక..

రాష్ట్రం నుంచి గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు వలస వెళ్తున్న కార్మికుల సంఖ్య ప్రభుత్వం వద్ద లేదు. నిర్దిష్టమైన విధానం లేకపోవడంతో ఏ దేశంలో తెలంగాణ వాసులు ఎంత మంది ఉన్నారు అనే వివరాలు నమోదు కాలేవు. కేరళ తరహాలో విదేశాలకు వలస వెళ్లే కార్మికుల సంఖ్య, ఇతర వివరాలను నమోదు చేసే ప్రక్రియ రాష్ట్రంలో త్వరలో అమలులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేరళలో అమలు చేస్తున్న ప్రవాసీ విధానంపై అధ్యయనం చేయడానికి అధికారుల బృందం వెళ్లి వచ్చింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బీఆర్‌ఎస్ పాలనలో గల్ఫ్ వలస కార్మికులు నిర్లక్ష్యానికి గురయ్యారనే ఆరోపణలు ఉన్నాయి.

అసెంబ్లీ ఎన్నికల నుంచి..

వలస కార్మికులు ఎన్నో ఏళ్ల నుంచి తమ కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు లేదా ప్రవాసీ విధానం(ఎన్‌ఆర్‌ఐ పాలసీ) అమలు చేయాలని కోరుతూనే ఉన్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికుల ఆశలను నెరవేర్చే సాహసం చేయలేదు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి రాష్ట్రంలో గల్ఫ్ అంశం చర్చకు వచ్చింది. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం విషయంపై స్పష్టమైన హామీ ఇచ్చింది. ఎన్నికల సందర్భంలో టీపీసీసీ ప్రతినిధులు గల్ఫ్ దేశాలకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచి గెలుపునకు కృషి చేయాలని ప్రచారం చేపట్టారు. గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాల ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థులకు గంప గుత్తగా పడటంతోనే కొన్ని నియోజకవర్గాల్లో సానుకూల ఫలితాలు లభించాయి. నాటి నుంచి గల్ఫ్ బోర్డు అంశం ఏదో ఒక విధంగా చర్చకు వస్తూనే ఉంది.

అందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చి..

గల్ఫ్ బోర్డు ఏర్పాటు విషయంలో ప్రభుత్వం నుంచి కీలకమైన ప్రకటన వెలువడేలా చేయడంలో టీపీసీసీ ఎన్నారై సెల్ అంతర్జాతీయ కన్వీనర్, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు మంద భీంరెడ్డి కృషి ఎంతో ఉందని వలస కార్మికులు, నాయకులు పేర్కొంటున్నారు. సీఎం, అధికార బృందం సభ్యులకు ప్రత్యేక బోర్డు ఆవశ్యకతపై విశ్లేషించడంతో సీఎం తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది.

ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం



నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని పార్టీ ఎమ్మెల్యేలు, ప్రతినిధులు పేర్కొన్నారు. నగరంలోని జీజీ కళాశాల మైదానంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో విశాల జనసభ నిర్వహించారు. సభలో బీజేపీ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రతినిధులు బీజేపీ గెలుపుపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

బీజేపీపై విషం కక్కుతున్నారు..



దేశవ్యాప్తంగా, తెలంగాణలో బీజేపీకి పెరుగుతున్న ప్రజాధరణను ఓర్వలేక సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు బీజేపీపై విషం కక్కుతున్నారు. తెలంగాణలో బీజేపీ అత్యధిక ఎంపీ స్థానాల్లో విజయం సాధిస్తుంది. జిల్లాలో అధిక మెజార్టీతో అర్వింద్ గెలుపు ఖాయం.

– ధన్‌పాల్ సూర్యనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే

కాంగ్రెస్ దేశద్రోహుల పార్టీ



కాంగ్రెస్ దేశద్రోహుల పార్టీ. ఇందిరాగాంధీ, ప్రియాంకగాంధీ హిందువులను పెళ్లి చేసుకోలేదు. ఆ కుటుంబం హిందువులపై నరనరాన విషం నింపుకొని ఉంది. ఈ ఎన్నికలు దేశద్రోహులు, ధర్మ రక్షకులకు మధ్య జరుగుతున్న యుద్ధం.

– పైడి రాకేశ్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే

మోదీ వెంట నడవాలి..

దేశ ప్రజలు మోదీ వెంట నడవాలి. మీటర్ గేజ్ నుంచి బ్రాడ్ గేజ్ చేయాలని గతంలో రైల్వే పట్టాలపై పడుకుని ఉద్యమించాను. రైల్వే ఆధునీకీకరణకు మోదీ సర్కారు సంస్కరణలు తీసుకొచ్చింది. బ్రాడ్ గేజ్ కాదు ఏకంగా రైల్వేలైన్ విద్యుద్దీకరణ (ఎలక్ట్రిఫికేషన్)గా మార్చారని తెలిపారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి.

– యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

చెప్పినవన్నీ చేసి చూపించాం



దేశంలో ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిర నిర్మాణం, సీఏఏ అమలు చేస్తామని చెప్పిన బీజేపీ చేసి చూయించింది. రాబోయే రోజుల్లో బీజేపీ యూనిఫాం సివిల్ కోడ్, ఎన్‌ఆర్‌సీ, ఇతర కార్యక్రమాలు ఖచ్చితంగా తీసుకొస్తాంది.

– పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి

పొరపాట్లకు తావులేకుండా ఈవీఎంల కమిషనింగ్

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆర్మూర్, భీంగల్: ఎన్నికల్లో పోలింగ్ నిర్వహణకు చేపడుతున్న ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆర్మూర్, బాల్కొండ శాసనసభా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్ ఆదివారం సందర్శించారు. ఆర్మూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, భీంగల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న కమిషనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గందరగోళానికి తావులేకుండా పోలింగ్ కేంద్రాల వారీగా కమిషనింగ్ జరిపించాలని సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. కాగా, ఆర్మూర్, భీంగల్ పట్టణాల్లో పోస్టల్ బ్యాలెట్ కోసం ఎంపీడీవో కార్యాలయాలు, విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను సైతం కలెక్టర్ సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ వివరాలతో కూడిన రిజిస్టర్లను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు వస్తున్న వారికి హెల్ప్ డెస్క్ ద్వారా సహకారం అందించాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, అధికారులు ఉన్నారు.

జ్ఞాపకాల సమ్మేళనం



ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో..



పద్మశాలి ఉన్నత పాఠశాలలో..



తాడ్‌బిలోలి హైస్కూల్‌లో..



పొతంగల్ హైస్కూల్‌లో..



కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

కమ్మర్‌పల్లి/ వేల్పూర్/ నిజామాబాద్ అర్బన్/ రెంజల్/ రుద్రూర్/ భిక్కనూర్: పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు చిన్ననాటి జ్ఞాపకాలకు వేదికలయ్యాయి. చిన్ననాటి మిత్రులు ఒకేచోట కలవడంతో ఆప్యాయంగా పలుకరించుకున్నారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో(1997–98), ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో(1998–99), నగరంలోని పద్మశాలి ఉన్నత పాఠశాలలో (1998–99), రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి హైస్కూల్‌లో (2008–09), కోటగిరి ఉమ్మడి మండలంలోని పొతంగల్ హైస్కూల్‌లో (2006–07), భిక్కనూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (1991–92) ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనాలు నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.



భిక్కనూరులో..

చెట్టును ఢీకొని ఒకరి మృతి

సిరికొండ: చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని సర్వల్లి తండాలో శివారులో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి మండలం గౌరారం గ్రామానికి చెందిన సంపంగి మహేందర్(28)కు సర్వల్లి తండా పరిధిలోని వడ్డెర కాలనీకి చెందిన లతికతో వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో సిరికొండలో కుల సంఘంలో ఆదివారం ఇరువర్గాలు చర్చించుకుందామని నిర్ణయించారు. దీంతో మహేందర్ తన బైక్‌పై సిరికొండకు వస్తుండగా తండా సమీపంలో చెట్టును ఢీకొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

లక్షకుపైగా మెజారిటీతో బీజేపీ గెలుపు



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ లక్షకుపైగా మెజారిటీతో గెలుస్తారని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన పట్టణ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు చిత్తుగా ఓడటం ఖాయమన్నారు. కామారెడ్డిలో వ్యాపారులను అధికారులు ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీలన్నీ నెరువేరుస్తానని అన్నారు. ఇక మిగిలిన వారం రోజుల పాటు ప్రతీ కార్యకర్త బీజేపీ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి మోదీ సర్కార్

మాచారెడ్డి : కేంద్రంలో మరో సారి ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ కొలువు దీరనుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం మాచారెడ్డి,పాల్వంచ మండల కేంద్రాల్లో వేర్వేరుగా జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వెంట నడుస్తున్నారని కాటిపల్లి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ మాట్లాడుతూ తనను మరోసారి ఆదరించి గెలిపిస్తే కామారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ స్పష్టం చేశారు. మాచారెడ్డి, పాల్వంచ మండల శాఖ అధ్యక్షులు బూస సురేష్, పోసు అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు పాన్నాల వెంకట్ రెడ్డి, ఓబీసీ అధ్యక్షుడు తోట బాల్ రాజు, నరసింహచారి, పుట్టకొక్కుల నర్సింలు రాజశేఖర్, హారిక ఉన్నారు.

క్రైం కార్నర్

డెంగీతో ఒకరి మృతి



బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్‌కు చెందిన గాండ్ల రాజేశ్వర్(52) డెంగీ వ్యాధితో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయి వెళ్లిన రాజేశ్వర్ తీవ్ర జ్వరానికి గురి కావడంతో పది రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్లగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ సోకినట్లు నిర్ధారించారు. దీంతో నాటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేశ్వర్ శనివారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



పిట్లం: భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కంభపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంబదాస్(30)కు రెండేళ్ల క్రితం రజితతో వివాహమైంది. వీరికి ఏడాది బాబు ఉన్నాడు. డ్రైవర్‌గా పనిచేసే అంబదాస్ మద్యానికి అలవాటుపడి పని మానేశాడు. దీంతో ఇంట్లో గొడవలు కావడంతో మూడు నెలల క్రితం భార్య రజిత తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అంబదాస్ ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సుభాష్‌గార్డెన్‌లో పర్యాటకులపై దాడి

- నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి శివారులో ఉన్న సుభాష్‌గార్డెన్‌లో ఆదివారం పర్యాటకులు, గార్డెన్ యాజమాన్యం మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన ఓ కుటుంబం సుభాష్‌గార్డెన్‌కు వెళ్లింది. సదరు కుటుంబంలోని యజమాని స్విమ్మింగ్‌పూల్‌కు ధరలు ఎక్కువగా ఉన్నాయని చెప్పడంతో గార్డెన్ నిర్వాహకులు, పర్యాటకుల మధ్య మాటా మాట పెరిగి ఘర్షణ జరిగింది. దీంతో సుభాష్‌గార్డెన్‌కు చెందిన వ్యక్తులు ఇనుపరాడ్‌లతో దాడి చేయడంతో నలుగురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డవారిని చికిత్స జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా సుభాష్‌గార్డెన్ యజమాని బాధితులపైనే ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

కోనాపూర్‌లో అగ్ని ప్రమాదం

- డెయిరీ ఫాం దగ్ధం
- రూ. 5 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన డెయిరీ ఫాం

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్‌లో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి రూ. 5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన మంగి హరీశ్ కొత్త చెరువు తండా రోడ్‌లో డెయిరీ ఫాం నడుపుతున్నాడు. ఫాంలో ఆరు ఆవులు, ఏడు బర్రెలు, ఐదు దూడలు ఉన్నాయి. ఫాంకు సమీపంలో ఉన్న వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో అవి డెయిరీ ఫాం వరకు వ్యాపించాయి. దీంతో ఫాంలోని గడ్డికట్టలతో పాటు పశువుల దాణాకు నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న హరీశ్ అక్కడికి చేరుకొని పశువులకు కట్టిన తాళ్లను తొలగించి విడిచి పెట్టాడు. మంటలు చెలరేగి షెడ్డుకు అంటుకున్నాయి. మెట్‌పల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే షెడ్డు కాలిపోవడంతో పాటు ఎండు గడ్డి కట్టలు, పశువుల దాణా, సామాగ్రి కాలి బూడిదైంది. సుమారు రూ. 5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

అల్ప్రాజోలం పట్టివేత



మాట్లాడుతున్న సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్

భిక్కనూరు: నిషేధిత మత్తు పదార్థమైన అల్ప్రాజోలంను రవాణా చేస్తూ పట్టుబడ్డ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్ ఆదివారం తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు పెద్దమల్లారెడ్డి గ్రామశివారులోని పెట్రోల్‌బంక్ సమీపంలో టీఎస్16 ఈడబ్ల్యూ 1970 గల కారును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేయగా వీరి నుంచి 248 గ్రాముల అల్ప్రాజోలం పట్టుకున్నారు. నాలుగు సెల్‌ఫోన్లు, రూ. 37,020 నగదు, కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అల్ప్రాజోలం సరఫరా చేస్తున్న నవీపేటకు చెందిన గొల్లపల్లి నరేశ్‌గౌడ్, గాంధారికి చెందిన భీమగొని దత్తాద్రిగౌడ్, మాక్లూర్‌కు చెందిన ఎల్లగొని సంతోష్‌గౌడ్, సంగం గ్రామానికి చెందిన కేసరి మల్లికార్జున్‌గౌడ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కామారెడ్డి కోర్టు న్యాయమూర్తి నలుగురికి 14 రోజుల రిమాండ్‌కు నిజామాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై–2 రాంచందర్ పాల్గొన్నారు.

కుర్నాపల్లిలో..

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లిలో అల్ప్రాజోలంను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఇద్దరి వ్యక్తుల వద్ద సుమారు కిలో వరకు మత్తుపదార్థాలు ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడిలో ఒకరిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

ఆర్మూర్‌లో బైక్ చోరీకి యత్నం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బైక్ చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. పట్టణంలోని జంబిహనుమాన్ ఆవరణలో ఉన్న గంధ్రాలయం ఎదుట నిలిపి ఉంచిన పాఠకుడి బైక్‌ను వేల్పూర్‌కు చెందిన శివ చోరీకి పాల్పడి పారిపోతుండగా స్థానికులు వెంబడించి పెర్కిట్ వద్ద పట్టుకున్నారు. అనంతరం దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు.

గడువు ముగిసిన కూల్ డ్రింక్స్ విక్రయం



రుద్రూర్: పొతంగల్ మండలం కల్లూర్‌లో గడువు ముగిసిన కూల్ డ్రింక్స్ విక్రయాలు కొనసాగుతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండడంతో కూల్ డ్రింక్స్ తాగడానికి వచ్చే వారికి వ్యాపారులు ఇదే అదునుగా భావించి అధిక ధరతో పాటు గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రం నుంచి ఇద్దరు పని నిమిత్తం కల్లూర్‌కి రాగా ఓ షాపులో కూల్‌డ్రింక్ సేవించారు. తీరా బాటిల్‌పై ఫిబ్రవరికే గడువు ముగిసిన విషయాన్ని గమనించిన వారు యజమానిని ప్రశ్నించారు. సదరు యజమాని దురుసుగా వ్యవహరించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గడువు ముగిసిన కూల్‌డ్రింక్ అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

మల్లారంలో నేరడిగొండవాసి హత్య

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని మల్లారం అటవీ ప్రాంతంలో నిర్మల్ జిల్లా నేరడిగొండవాసి హత్యకు గురయ్యాడు. ఆదివారం నేరడిగొండ పోలీసులు స్థానిక పోలీసుల సహాయంతో ఘటన జరిగిన స్థలానికి చేరుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలానికి చెందిన గంగయ్య (35) ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సెల్‌ఫోన్ రికార్డులను పరిశీలించారు. మిస్సింగ్ అయిన తర్వాత చివరగా ఎవరితో మాట్లాడారో తెలుసుకొని నిజామాబాద్ నగరంలోని ఐదోటౌన్ పీఎస్ పరిధిలోని నివాసిని అదుపులోకి తీసుకొని విచారించారు.

అతడు నేరడిగొండ వాసి మల్లారం ప్రాంతంలో చనిపోయాడని తెలుపడంతో ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అక్కడ ఓ వ్యక్తిని కాల్చివేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ఆత్మహత్య చేసుకోవడంతో కాల్చివేసినట్లు పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి తెలిపాడు. ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు కాల్చివేయాల్సి వచ్చిందనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

నేరడిగొండ వాసికి నిజామాబాద్‌వాసికి సోషల్ మీడియాలోని ఓ ఆన్‌లైన్ యాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. కాగా నేరడిగొండ వాసి హత్యకు పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని రూరల్ సీఐ సురేశ్ తెలిపారు.